ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 238 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 4 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు

- హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారుస్తాం
- హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా
- నిధులు తెస్తరా గుజరాత్‌కు వలసపోతారా
- కిషన్ రెడ్డిని నిలదీసిన సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ ప్రక్షాళనతో నిర్వాసితులకు అండగా ఉన్నాం
- నిద్రలు చేయడం మాని నిధులు తీసుకురండి
- ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకురాలేదు
- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలి
- కేంద్రం నుండి రూ. 10 వేల కోట్లు తీసుకురండి
- పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్
- అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్‌దే
- రైజింగ్ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో రైజింగ్ ఉత్సవాల నిర్వహణ







హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద గల హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైజింగ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలలో భాగంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి ..మిగతా 2లో

# ఈనెల 5న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం
### రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్ల మంజూరు
### ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్ల కేటాయింపు
### ఈనెల 6నుంచి గ్రామాల్లో అధికారులు పర్యటన
### లబ్ధిదారులను గుర్తించనున్న అధికారులు
### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన



హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 5న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రీకారం చుట్టబోతున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో మంగళవారం (డిసెంబర్ 03) వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి ఆయన విస్తృత పర్యటన చేశారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల 62 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో అధికారంలో ..మిగతా 2లో

# హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

### రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు



హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలు, పార్కుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా కు తెలంగాణ ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. మంగళవారం, హైడ్రా కార్యాలయ నిర్వహణకు, వాహనాల కొనుగోలుకు రూ.50 కోట్ల నిధులు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఆవిర్భావం తరువాత జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ..మిగతా 2లో

# బ్రిటిష్ భావజాలం నుంచి మనం బయటపడాలి

### నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగు
### భారతీయులను లొంగదీసుకునేందుకు ఆనాటి చట్టాలు
### చండీఘడ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): రాజ్యాంగం కన్నకలలను సాకారం చేసేందుకు దేశంలో అమల్లోకి వచ్చిన సరికొత్త నేర నియంత్రణ చట్టాలు బలమైన ముందడుగుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బ్రిటిష్ వలస విధానం నుంచి మనం బయటపడాల్సి ఉందన్నారు. చండీగఢ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లలో దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలను జాగ్రత్తగా అధ్యయనం చేసి వీటిని రూపొందించారన్నారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఆంగ్లేయులు వెళ్లిపోయాక వారి చట్టాల నుంచి ..మిగతా 2లో

# రియల్ రంగంలో హైదరాబాద్‌దే అగ్రస్థానం

### బిల్డ్ నౌ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం
### భవనాల లే ఔట్ల అనుమతులు మరింత సరళం
### నిబంధనలు సరళతరం చేయాలన్న లక్ష్యం
### ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి





హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్‌లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన యాప్‌తో పాటు, విధానాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. సచివాలయంలో బిల్డ్ నౌ అనే యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పట్టణాభివృద్ధిలో గతంలో లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది జనాభా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉంటున్నందున ఈ శాఖ ప్రాధాన్యతపై దృష్టి పెట్టి.. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అమలు చేస్తున్నాం. స్థిరాస్తి రంగంలో ఇప్పటికీ హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. హైదరాబాద్ ప్రజలే గృహ రుణాలు అధికంగా తీసుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం నూతన సమగ్ర భవనాలు , లేఅవుట్ల ఆమోదానికి సంబంధించిన ..మిగతా 2లో

# హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు నమోదు

### లక్ష కేసులు పెట్టినా సరే.. ప్రజా కోర్టులో నీకు శిక్ష తప్పదు : హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. మిస్టర్ రేవంత్ రెడ్డి అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీ మీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావని మండిపడ్డారు. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడమని విమర్శించారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్‌లో తనపై తప్పుడు కేసు పెట్టించాడని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించినవని అన్నారు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించినవని విమర్శించారు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించినవని అన్నారు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజా క్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక పంజాగుట్ట స్టేషన్‌లో మరో తప్పుడు కేసు పెట్టించారని తెలిపారు.నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగనని తెలిపారు.

# పుష్ప-2 టిక్కెట్ ధరల పెంపు

### ధరల పెంపుపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): టాలీవుడ్ సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా టికెట్ ధరలు పెంపుపై హైకోర్టులో విచారణ జరిగింది. బెనిఫిట్ షో లకు భారీగా టికెట్ ధరలు పెంచారని, సామాన్యులు మూవీ చూసే పరిస్థితి లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలు రెండు వారాల్లో సమర్పించాలని మైత్రి మూవీస్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

### తమిళనాడులో 'ఫంగల్' తుఫాను
# భారీ విధ్వంసం

### రాష్ట్రంలో సంభవించిన విపత్తు, భారీ నష్టం
### పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని ఆరా
### రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని హామీ



విల్లుపురం, డిసెంబర్ 3 (ప్రభాత ఉదయం): 'ఫంగల్' తుఫాను తమిళనాడులో భారీ విధ్వంసం సృష్టించింది. భారీ వర్షాలు, తుఫాను కారణంగా వరదలు రాష్ట్రంలో భారీ నష్టం కలిగించాయి. ఈ బీభత్సంలో చాలా మంది మరణించారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తు, అక్కడి పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. రాష్ట్రానికి అన్ని విధాలా సాయం చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో ప్రధాని మోదీ మాట్లాడారని, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదల పరిస్థితిపై సమాచారం అందుకున్నారని ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక వర్గాలు తెలిపాయి. స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తమిళనాడులోని ఉత్తర ప్రాంతంలోని విల్లుపురం జిల్లాలో సోమవారం భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా అపూర్వమైన వరదలు సంభవించాయి.

# ఎవరెన్ని కుట్రలు పన్నినా అభివృద్ధి ఆగదు

**మొదటి పేజీ తరువాయి...**

విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మార్చాలనేది తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ప్రభుత్వం మాయమాటలు చెప్పి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. హైదరాబాద్ నగర సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించి, నగరానికి కావలసిన మౌలిక సదుపాయాలపై తాము ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూసేలా మూసీ సుందరీ కరణ పేరుతో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి విషయంలో తాము వెనుకడుగు వేయబోమన్నారు. హైదరాబాద్ నగరం అంటేనే దేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు గల నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరం ఎందరో యువకులకు ఉపాధినిస్తుందని, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఎందరో నాయకులు, ఐటీ కంపెనీలను హైదరాబాద్ కు తీసుకువచ్చి నగరం అభివృద్ధికి దోహద పడ్డారన్నారు. పిజెఆర్ వల్లే గోదావరి జలాలు నగరానికి వచ్చాయని తెలిపారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలకు పోటీనిచ్చే సత్తా ఉన్న నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం తెలిపారు. ఎన్నో కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, ప్రభుత్వానికి 65 శాతం ఆదాయం ఇక్కడి నుండే వస్తుందన్నారు. తెలంగాణ మణిహారంగా రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం సాగిస్తున్నామని, 7 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి హోదాలో గల సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి, కేంద్రంతో మాట్లాడి ఒక్క రూ.10 వేల కోట్లు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట తాము నిర్వాసితులకు అండగా నిలబడుతుంటే, అక్కడికి వెళ్లి నిద్రలు చేయడం మాని కేంద్రం నుండి నిధులు తీసుకురావాల్సిన భాధ్యత కిషన్ రెడ్డిపై ఉందన్నారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా కిషన్ రెడ్డి తీసుకు రాలేదని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం సహకారం కావాలని, నిధులు తెస్తరా గుజరాత్ కు వలసపోతారా మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి ఎంత నిధులు తీసుకొస్తవ్ అంటూ సీఎం ప్రశ్నించారు. పదేళ్లు తెలంగాణను భ్రష్టు పట్టించిన కేసీఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కి పరిమితమై, తాము చేసే అభివృద్ధికి అడ్డు పెట్టడం ఎలా అంటూ ఆలోచిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ట్యాంక్ బండ్ నీరు పాలమాదిరిగా మారుస్తామని హామీలిచ్చి, పదేళ్లు అప్పుల ఊబిలోకి నెట్టేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. బీఆర్ ఎస్ , బీజేపీలపై చర్చించేందుకు తాను సిద్దమని, మీ పాలసీ డాక్యుమెంట్ ను తెలంగాణ సమాజానికి చూపించండంటూ సీఎం సవాల్ విసిరారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి తాము కట్టుబడి, వేల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి అధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తామని, అఖిల పక్ష సమావేశం సైతం నిర్వహిస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ఏమేమి సలహాలు ఇస్తారో ఇవ్వండి అంటూ సీఎం పిలుపునిచ్చారు. రాజధాని గుండా ప్రవహిస్తున్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకువచ్చి మురికి కూపంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. దాంతో పాటు హైదరాబాదు నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చి పర్యాటకంగా, అందంగా అభివృద్ధి చేసి, మూసిని జీవ నదిగా మార్చాలని తమ ప్రభుత ముందుకుపోతందన్నారు. ఇది ప్రతిపక్షాలకు ఇష్టం లేదని అందుకే అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం గుండా 55 కిలోమీటర్ల పైగా ప్రవహిస్తున్న మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి పునరుజ్జీవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నది. గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలిపి పునరుజ్జీవం తీసుకువస్తామన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి విద్య ఉపాధి అవకాశాలు పెంచుతామన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించలేమన్న భయంతో కుట్రపూరితంగా బిఆర్ఎస్ తన సోషల్ మీడియా ద్వారా ప్రజలను రెచ్చగొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం మీద ప్రేమ, పేదవాళ్లపై అభిమానం ఉంటే సహకరించాల్సింది పోయి కుట్రలు చేయడం మానుకోవాలని బిఆర్ఎస్ నాయకులకు సూచించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు.

## ఈనెల 5న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

**మొదటి పేజీ తరువాయి...**

ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చిందని మండిపడ్డారు. ప్రతి నెల రూ.6 వేల 500 వందల కోట్లు అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ కార్డు లేని వారికి ప్రభుత్వం ఇటీవల గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో వెల్లడించారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో గత నెలల జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్ శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. కాగా గతంలో రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేసింది. మొదటి విడతలో వీరికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలకు ఇది నిజంగా శుభవార్తనే చెప్పాలి. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర్గ పరిధి సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తిరుమలాయపాలెం మండలం కాంగ్రెస్ శ్రేణులు, అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మొదటి విడతలో పేదలు, నిరుపేదల విభాగాలుగా పరిశీలించి ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించామని తెలిపారు. రెండో విడత నుంచి మాత్రం రేషన్‌కార్డే ప్రామాణికంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. త్వరలోనే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో వృద్ధాప్య, దివ్యాంగులు, వితంతువులు తదితర పింఛనుకు అర్హులను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన వారు ఎంతమంది ఉన్నా పింఛను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అదే సమయంలో అనర్హులైన వారికి ఒక్కరికి పింఛన్ ఇచ్చినా ఇబ్బంది పడాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. ఈ క్రమంలోనే రేషన్ కార్డు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు మొదటి విడతలో మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. రెండో విడత నుంచి ఆ అవకాశం ఉండదన్నారు.

## డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు




రాజేంద్రనగర్, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) నషా ముక్త్ భారత్ డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్ మూమెంట్లో భాగంగా మైలర్ దేవ్ పల్లి బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎస్టీ ఆంటోనీస్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు... ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రాజేందర్, ట్రాఫిక్ సిబ్బంది, బజరంగ్దళ్ నేతలు మహేందర్, రాహుల్ అజయ్ తదితరులు పాల్గొన్నారు .

## ఈ ప్రభుత్వాలు సామాన్యుల గురించి ఆలోచించవా!

**బిజెపి నాయకులు కొమ్ము భరత్ భూషణ్**



కొత్తకోట, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డప్పటినుండి ఈ రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితులను ఆలోచించే నాయకుడే లేడని కొత్తకోట మున్సిపాలిటీ బిజెపి నాయకుడు కొమ్ము భరత్ భూషణ్ అన్నారు .నా ఒక్కని కారణంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డదన్న ధీమాతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగించడం, ఆయన మంత్రివర్గం లోని మంత్రులు కేసీఆర్ లైను దాటకుండా మా ఒక్క పార్టీ కారణంగానే తెలంగాణ రాష్ట్రం సంపాదించబడ్డది అన్న ఆలోచనతో ఈ రాష్ట్రంలో కొన్ని పనులు సాగాయన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పూర్తి అపస్మారక స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయిందన్నారు.35-40 సంవత్సరాలు ఏకధాటిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ కు గ్రామాల్లో పోటీకి సర్పంచ్ అభ్యర్థులు దొరకలేదంటే అతిశయోక్తి కాదన్నారు. అలాంటి కాంగ్రెస్ ను నా ఒక్కని కారణంగానే అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్న అహంకారంతో నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారు. ఆయన మంత్రివర్గంలోని మంత్రులు పార్టీలో, వయసులో సీనియర్లు అయినప్పటికీ, ఆయన లైన్ ను దాటకుండా, వారి పదవులకు ముప్పు రాకుండా ఉండే విధంగా పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో సాగు, పడావు కలుపుకొని 1,52,49,486 ఎకరాల భూమి ఉన్నట్లు అంచనా అన్నారు. ఈ మొత్తం భూమికి 58, 34,000 మంది యజమానులు ఉన్నారన్నారు. మొత్తం తెలంగాణ రాష్ట్ర జనాభా 2011 లెక్కల ప్రకారం 350,03674 కోట్ల మంది. (ప్రస్తుతం నాలుగు కోట్లకు చేరువైందన్నారు.ఇంత మొత్తం జనాభాకు కాను కేవలం 58 లక్షల 34 వేల మందికి భూస్వాములకు మాత్రమే గత 11 సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా ఏదో భరోసా కింద సహాయం అందుతుందన్నారు.దాదాపు రెండు కోట్ల పైచిలుకు జనాభా కు గత 11 సంవత్సరాల నుండి ఎలాంటి సహాయ, సహకారాలు ప్రభుత్వాల నుండి అందడం లేదన్నారు. పెన్షన్, ఇతర కార్పోరేషన్ల ద్వారా సహకారాలు అరకొర మాత్రమే అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా రేషన్ బియ్యం అందిస్తుందన్నారు.తెలంగాణను పాలించిన పాలకులు అధిక జనాభా గల కూలీ,నాలీ చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదలను విస్మరించడం సోచనీయమన్నారు. ఇంటర్మీడియట్, ఆపై స్థాయి విద్యను అభ్యసించే డే - స్కాలర్ విద్యార్థులకు గత 4, 5 సంవత్సరాల నుండి ఉపకార వేతనాలు రావడం లేదన్నారు. ప్రైవేటు కార్పోరేట్ రెసిడెన్షియల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఫీజు రియంబర్ మెంట్స్ రూపాన ఆయా కళాశాలల యజమాన్యానికి అందుతున్నాయి. అందుకు కళాశాలల యజమాన్యం పాలకులకు ప్యాకేజీలు ముట్ట చెబుతున్న కారణంగా ఆ నిధులు విడుదలవుతున్నట్టు వినికిడన్నారు. గత 11 సంవత్సరాల నుండి ఒక కొత్త రేషన్ కార్డు లేదు, కొత్త పెన్షన్ లేదు, కొత్త ఇల్లు లేదన్నారు. మొత్తం 2.91 లక్షల కోట్ల బడ్జెట్లో భూములు ఉన్న భూస్వాములకే సింహభాగం కేటాయించడం బాధాకరమన్నారు.రాష్ట్ర పాలకుల తీరు విభజించు - పాలించు అన్న చందంగా నడుస్తుందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలని ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందిన్నారు.ఇదే రకమైన పాలన కొనసాగితే, భూమిలేని నిరుపేదలు హింస మార్గాన్ని ఎన్నుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకుల్లో మార్పు రావాలి. ఈ రాష్ట్రంలో అధిక జనాభా ఉండి, భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల బాగోగులను బాగుపరచాలని, అధికారంలోకి రావడం కొరకు ఏవైతే ఉచిత పథకాలను ప్రకటించారో వాటిని తక్షణమే అమలుకు ఉపక్రమించాలన్నారు.



గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసిన నాయకులు

## గద్వాల ఎమ్మెల్యేగా ఏడాది పాలన

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం)గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా రెండోసారి ఘన విజయం సాధించి మంగళవారం సరిగ్గా ఏడాది పూర్తయింది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో గద్వాల ఎమ్మెల్యేగా బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రెండోసారి గెలుపొందారు. ఈ శుభ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించుకొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గద్వాల నియోజకవర్గ ప్రజల అండదండలతోనే అభివృద్ధి బాటలో ఏడాది పాలన కొనసాగిందని డిసిసిబి డైరెక్టర్ ఎంఏ సుభాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, జి వేణుగోపాల్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు దౌలు పూడూరు కృష్ణ, శ్రీను, నరహరి గౌడ్, రిజ్వాన్, రామకృష్ణ శెట్టి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి,మాజీ ఆలయం కమిటీ చైర్మన్ గాయత్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో ప్రైవేటు ఆసుపత్రి సీజ్ చేసిన అధికారులు




గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం)వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళకు ఆపరేషన్ చేసే క్రమంలో రోగికి మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో కోమాలోకి వెళ్లింది. కర్నూల్ లో చికిత్స పొందుతూ ఆ మహిళ డిసెంబర్ 1న మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్. ఎస్ కే .సిద్ధప్ప మరియు మాత శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. ప్రసూన రాణి ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల పట్టణంలోని శివబాలాజీ హాస్పిటల్ ని తనిఖీ చేశారు. శివ బాలాజీ హాస్పిటల్ డైరెక్టర్ కు నోటీసు అందించారు. తదుపరి విచారణ నిమిత్తం , ఇచ్చిన నోటీసు కు సవివరనాత్మక వివరణ ఇచ్చేవరకు తాత్కాలికంగా శివ బాలాజీ హాస్పిటల్ ను మరియు ఆపరేషన్ థియేటర్ ను కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా సీజ్ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది కే. మధుసూదన్ రెడ్డి, తిరుమలేష్ రెడ్డి, నరసయ్య , హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాకు భారీగా నిధులు కేటాయింపు

**మొదటి పేజీ తరువాయి...**

చెరువులు, కుంటలు ఆక్రమణల నుండి విముక్తి పొందాయి. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి నగరంలోని పర్యావరణాన్ని కాపాడేందుకు ఈ సంస్థ నిరంతర శ్రమ చేస్తోంది. ల్గ÷డ్రాకు మరింత శక్తివంతమైన అధికారాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా హైడ్రా అనేక విస్తృత అధికారాలను పొందుతూ, చెరువుల రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధునాతన సాంకేతిక పద్ధతులు, వాహనాల కొనుగోలు, కార్యాలయ నిర్వహణకు ఉపయోగించనున్నారు. ఈ నిధులు హైడ్రా పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయి. ఈ చొరవతో చెరువుల సంరక్షణ, పర్యావరణ రక్షణలో హైదరాబాద్ నగరం దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో హైడ్రా కొరడా ఝుళిపించింది. అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో పార్కు స్థలాన్ని ఆక్రమించి, ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేసిన ఘటనపై హైడ్రా, పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాలనీ వాసులు ఈ సమస్యను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి నివేదించారు. గతంలో ఈ ఘటనపై కమిషనర్, హైడ్రా, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, వెంటనే చర్యలు తీసుకోవడం లేదని వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న లక్ష్మారెడ్డి, హైడ్రా, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బ్రిటిష్ భావజాలం నుంచి మనం బయటపడాలి

**మొదటి పేజీ తరువాయి...**

విముక్తి లభిస్తుందని భావించారు. అసలు భారత్‌పై పట్టుబిగించేందుకు ఏం చేయడానికైనా సిద్ధపడి వారు ఆ చట్టాలను చేశారు. కానీ, స్వాతంత్ర్యం వచ్చాక కూడా దురదృష్టవశాత్తు ఆ పాత చట్టాల చుట్టూ పాలకులు తిరిగారు. కానీ, ఇప్పుడు దేశం ఆ వలసపాలకుల మనస్తత్వం నుంచి బయటపడింది‘ అని పేర్కొన్నారు. ‘చండీగఢ్‌కు వస్తే.. నా మనుషుల మధ్యకు వచ్చినట్లు ఉంటుంది. ఈ నగరం శక్తిస్వరూపిణి చండీ అమ్మవారి పేరుతో ముడిపడింది. ఆమె సత్యం, న్యాయాన్ని నిలబెట్టారు. ఇదే భావనతో భారత న్యాయసంహిత చట్టాలు ఉన్నాయి. వీటి పరిధిలోకి దేశం రావడం చాలా గొప్ప ఆరంభం. ప్రజల కోసం మన రాజ్యంగా ఏమి ఆదర్శాలను ఊహించుకున్నామో వాటిని పూర్తి చేయడానికి ఇవొక కీలక ప్రయత్నం. ఈ చట్టాలు ఎలా అమలు చేస్తారనేది లైవ్ డెమో చూశాను. ప్రజలు కూడా వీటిని చూడాలని కోరుతున్నానని అన్నారు. దేశంలోని సరికొత్త న్యాయసంహిత చట్టాలు సమగ్రమైనవి. వీటిని తయారీ పక్రియ కూడా చాలా విస్తృతంగా ఉంది. దీనిలో ఎంతో మంది నిపుణుల కష్టం దాగి ఉంది. హోమ్ మంత్రిత్వశాఖ 2020 జనవరిలో అభిప్రాయాలు కోరింది. సుప్రీం కోర్టు, హైకోర్టులు, న్యాయవిద్యాలయాలు, పౌర సంస్థలు, మేధావులు ఏళ్ల తరబడి చర్చించి, తమ అనుభవాలను రంగరించారు. గతంలో ఎదురైన సవాళ్లను విశ్లేషించారు. భవిష్యత్తుకు సరిపడా ప్రమాణాలను దానిలో చేర్చారు. ఇది మన న్యాయ యాత్రలో మైలురాయిగా మిగులుతుంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా మంగళవారం ఉదయమే నగరంలోని పంజాబ్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకొన్నారు. ఈ సందర్భంగా వారు ఆధారాలు ఎలా సేకరిస్తారో తెలియజేస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను వీక్షించారు. పంజాబ్ సీనియర్ ఎస్పీ కన్వర్‌దీప్ కౌర్ ప్రధానికి కీలక విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ గవర్నర్ గులాబ్ ఛాంద్ కటారియా పాల్గొన్నారు.

## రియల్ రంగంలో హైదరాబాద్‌దే అగ్రస్థానం

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవస్థ బిల్డ్ నౌ అన్నారు. ఇది అత్యాధునిక ప్రజాపాలన దిశగా ఒక విప్లవాత్మక అడుగు. భారతదేశంలోనే వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటీ్న వ్యవస్థ ఇది నిదర్శనమని అన్నారు. ఈ నూతన వ్యవస్థ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది. అనుమతులు, డ్రాయింగ్ స్క్రూటీ్న ప్రాసెసింగ్ సమయాన్ని వారాల నుంచి నిమిషాలకు తగ్గిస్తుంది. పనితీరులో ఇది ఒక బెంచ్ మార్క్ గా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఈ అత్యాధునిక వ్యవస్థ భవన నిబంధనలు , అనుమతులకు సంబంధించి ప్రజల అవసరాలను వేగంగా తీర్చడంతో పాటు విశ్వసనీయంగా , స్నేహపూర్వకంగా ఉంటుంది. ప్రజలు , నిర్మాణదారుల కోసం శక్తివంతమైన, అధునాతన వ్యవస్థగా అభివీర్ణించారు. బహుళ అంతస్తుల భవనాలను కూడా 5 నిమిషాల్లో ప్రాసెస్ చేయగల వేగంతమైన స్క్రూటీ్న ఇంటిన్ ఇది. ప్రజలు పలు విభాగాలకు వెళ్లడం , వివిధ పోర్టల్స్ మారే అవసరం లేకుండా అనుమతి పక్రియ అంతా ఒకే చోట పూర్తి చేయగల ఏకీకృత సింగిల్ విండో ఇంటర్ పీస్ ఇదని మంత్రి వివరించారు. ప్రజలు తమ భవనాలను నిర్మాణానికి ముంది వాస్తవికంగా అగ్మెంటెడ్ రియాలిటీ 3డీ విజువలైజేషన్ ద్వారా చూడొచ్చు. భవన నిబంధనలపై తక్షణం, కచ్చితమైన మార్గదర్శకాలను ఈ ంఎ ఆధారిత పవర్డ్ అసిస్టెంట్ అందిస్తుంది. ప్రతి దరఖాస్తును ధృవీకరించి ట్రాక్ చేసేందుకు నమ్మకాన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ అవాకశం కల్పిస్తుంది. డేటా ఆధారిత పాలనను చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అభివృద్ధి నివేదికను ప్రజల ముందు పెడుతున్నామన్నారు. రికార్డు స్థాయిలో పట్టణాభివృద్ధి జరిగిందని, హైదరాబాద్ పర్ క్యాపిటల ఇన్‌కమ్19.3 చొప్పున పెరుగుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ ఇప్పటికి మొదటి స్థానంలో ఉందని, ఉబటూ గత 15 సంవత్సరాలుగా తెలంగాణ వార్షిక అభివృద్ధి రేట్ పెరిగిందన్నారు. చాలా మంది కి ఉపాధి కల్పన.. ప్రతీ ఇంట్లో ఆదాయం పెరిగిందని, తమ మధ్య సిద్దాంత పరంగా రాజకీయ విధానాలు వేరుగా ఉన్నప్పటికీ ప్రగతిశీల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. గృహ సముదాయాల అమ్మకాల్లో కూడా హైదరాబాద్ ముందంజలో ఉందని, హోమ్ లోన్స్ అంశంలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, 45 వేల ఉద్యోగాలు ఐటీలో ఇచ్చాము. ప్రస్తుతం 9.7 లక్షల మంది ఐటి ఉద్యోగులు హైదరాబాద్ లో పని చేస్తున్నారన్నారు.

# రాజేంద్రనగర్ పాస్టరమ్మల ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు


బైబిల్ సందేశాలను వివరిస్తున్న పెనుయేల్ గాస్పెల్ చర్చ్ సీనియర్ పాస్టర్ సిస్టర్ రోజా జాషువా గుమ్మళ్ళ


పాస్టరమ్మలు, పాస్టర్లనుద్దేశించి మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ బ్రదర్ దీపక్ జాన్


రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మళ్ళ దంపతులను సన్మానిస్తున్న పాస్టరమ్మల ఫెలోషిప్ సభ్యులు


అతిథులు, పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులను సన్మానించిన రెవరెండ్ డాక్టర్ జాషువా గుమ్మ ళ్ళ, సిస్టర్ రోజా గుమ్మళ్ళ లు

**ఆతిధ్యమిచ్చిన పెనుయేల్ గాస్పెల్ చర్చ్**
**బైబిల్ సందేశాలను అందచేసిన సిస్టర్ రోజా జాషువా గుమ్మళ్ళ**
**అండగా ఉంటామన్న తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**

బుద్వేల్, డిసెంబరు 3(ప్రభాత ఉదయం): దేవుని ప్రణాళికలో మరియ ఉన్నదని అందుకే ఆమె దేవుని ఆశీర్వాదాలు పొందుకున్నదని పెనుయేల్ గాస్పల్ చర్చ్ సీనియర్ పాస్టర్ సిస్టర్ రోజా జాషువా గుమ్మళ్ళ అన్నారు. రాజేంద్రనగర్ పాస్టరమ్మ ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం గండిపేట్ మండలం బండ్లగూడ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ప్రతి క్రైస్తవ విశ్వాసి దేవుని ప్రణాళికలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అప్పుడే ఆయన ఆశీర్వాదాలకు పాత్రులుగా ఉంటామన్నారు. తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బ్రదర్ దీపక్ జాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు అండగా ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ పాస్టర్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు గాస్పల్ చర్చ్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ జాషువా గుమ్మల్ల పాస్టరమ్మల క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులకు, అతిథులుగా వచ్చిన వారికి సన్మానం చేశారు. రాజేంద్రనగర్ ఉమెన్స్ పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ప్రెసిడెంట్ పి . అనురాధ స్వర్ణ కుమార్ అధ్యక్షత న జరిగాయి. కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి సిస్టర్ స్వర్ణ రాజారామ్ పాస్టరమ్మల ఫెలోషిప్ వార్షిక నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ సిస్టర్ యేసుమణి , జాయింట్ సెక్రెటరీ సిస్టర్ ప్రసన్న సునీల్, ట్రెజరర్ సిస్టర్ ఫీబే, అడ్వైజరీ బోర్డు మెంబర్స్, సిస్టర్ లీనా దేవదాస్, సిస్టర్ హెప్సీబా, సిస్టర్ సుజాత రాంబాబు, కమిటీ మెంబర్స్ తో పాటు రాజేంద్రనగర్ పాస్టర్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ మెంబర్ రెవరెండ్ పి. స్వర్ణ కుమార్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ కె .సుందర్ పాల్, జనరల్ సెక్రెటరీ రెవరెండ్ ఈ .మనోహరం, వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ట్రెజరర్ రెవరెండ్ పాల్ పరమేశ్వర్, జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ ఎన్ రవి కుమార్, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వైద్య శిభిరంలో పాల్గొన్న డాక్టర్ అస్రా అంజు తో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్


కవ్వాలి నిర్వహిస్తున్న ఎం ఎం పహాడీకి చెందిన హస్మత్ ఉన్నిసా, మెహర్ బీ, బీబీ ల బృందం



ముగ్గులతో సంబరాలు పాల్గొన్న గ్రేస్ సదాలక్ష్మీ

# రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో ప్రజా పాలన విజయోత్సవాలు

బుద్వేల్, డిసెంబరు3(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజా పాలన ప్రజా విజోయత్సవాలు ఘనంగా నిర్వహించారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యటీ కమిషనర్ కె. రవి కుమార్ ఆద్వర్యంలో పారిశుధ్య కార్మికులతో పాటు అన్ని విభాగాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బుద్వేల్ బస్తీ దవఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అస్రా అంజు, డాక్టర్ హిమ బిందు ల ఆధ్వర్యంలో సిబ్బంది కి ఆరోగ్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అంజయ్య, సంతోష్ రెడ్డిలు పాల్గొన్నారు.

**కవ్వాలితో ఆకట్టుకున్న ముస్లీం మహిళలు**

ఎం ఎం పహడీ కి చెందిన ముస్లీం మహిళలు హస్మత్ ఉన్నీసా , మెహర్ బీ, బీబీ ల బృందం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో కవ్వాలి నిర్వహించి ఉద్యోగులను ఆకట్టుకున్నారు. పాటలు పాడి సంతోషంగా గడిపారు. ముస్లీం మహిళలు చేసిన కవ్వాలి కార్యక్రమాలతో కార్యాలయం ఆవరణ దద్దరిల్లిపోయింది.

**ముగ్గులు వేసి బతుకమ్మ ఆడిన మహిళా సంఘాల సభ్యులు**

మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయం ఆవరణలో ముగ్గులు వేసి రంగోళి వేడుకలను నిర్వహించారు. రాజేంద్రనగర్ టౌన్ లెవల్ ఫెడరేషన్ చైర్మన్ రోజా అద్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గ్రేస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఏ.సదాలక్ష్మీ వారితో కలసి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, ఏఎంహెచ్ రజనీకాంత్, శానిటరీ సూపర్ వైజర్ క్రిష్ణ కి షోర్, సురేశ్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు రేణుక, ఉపేందర్, విజయేందర్, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సెయింట్ ఆంథోనీస్ హై స్కూల్ విద్యార్థులు

# యువత, విద్యార్థులు మాధక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బుద్వేల్, డిసెంబరు3 (ప్రభాత ఉదయం): మాధక ద్రవ్యాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని కోరుతు మంగళవారం భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మైలార్దేవుపల్లి సెయింట్ ఆంథోనీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మైలార్ దేవుపల్లి పరిసర ప్రాంతాలలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. ఆరోగ్యమే మహా భాగ్యమని సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ఐ రాజేందర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. బజరంగ్ దళ్ నేతలు మహేందర్, రాహుల్, అజయ్ లు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మంచి అలవాట్లు కలిగి జీవించాలన్నారు. బాగా చదువుకుని దేశానికి ఉపయోగపడే విదంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ అంథోనీస్ స్కూల్ కరస్పాండెంట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బుద్వేల్, డిసెంబరు 3(ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లాలో 2023 - 2024 లో ఆశా వర్కర్లు చేసిన లెప్రసీ సర్వే కు సంబందించి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని, తిరిగి లెప్రసీ సర్వే చేయాలని శిక్షణ కార్యక్రమాలు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆశా వర్కర్ల సంఘం నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం శివరాంపల్లిలోని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు ను కలసి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతు వినతి పత్రం అందజేశారు. అనంతరం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్, సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాద్యక్షుడు జె.రుద్ర కుమార్, రాజేంద్రనగర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అద్యక్షుడు బచ్చల కూర స్వామీ, ఆశా వర్కర్లు సునంద, రాధిక, రమ్య, సుధ లతో పాటు నాయకులు మన్యం. యాదయ్య, రాజు లు ప్రసంగించారు. రంగారెడ్డి జిల్లాలో తిరిగి ఆశా వర్కర్లు లెప్రసీ సర్వే చేయాలని చేస్తున్న శిక్షణ ను వెంటనే అపాలన్నారు. ఆశాలకు ప్రతి నెల 1వ తేదీన పారితోషికాలు చెల్లిం చాలన్నారు. ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.10లక్షలు కల్పించాలన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గురిం చాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రంగారెడ్డి జిల్లాలో ఉన్న సుమారు 21 వేల మంది ఆశా వర్కర్లతో కలసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.


రంగా రెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటియు నాయకులు

# బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**101 కోట్ల నిధులతో 100 ఫీట్ల రోడ్డు**

**మహిళ సంఘాలకు మూడు కోట్ల రుణాల చెక్కుల పంపిణీ**

బండ్లగూడ, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి నక్లెస్ రోడ్డులో జరిగిన నగర అభివృద్ధి పనులలో ప్రారంభించారు. సోమవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ కలిసి నగర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మన బండ్లగూడలో 100 కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న 100 ఫీట్ల రోడ్డు, కార్పొరేషన్ పరిధిలో మహిళా సంఘాలకు 3 కోట్ల రుణాలను 35 మహిళా గ్రూపుల చెక్కును అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేసిన సందర్భంగా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి అన్న గారు శాంక్షన్ చేసేటువంటి ఇనాగ్రేషన్ కార్యక్రమంలో పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి , కమీషనర్ శరత్ చంద్ర , డిఇఇ యాదయ్య , ఏఈ రాజీవ్ , మెప్మా స్టాఫ్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం రేవంత్ రెడ్డితో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీలత

**కార్పొరేషన్ లో ప్రజా పాలన విజయోత్సవాలు...**

బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ లో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాల్లో సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం,మహిళా క్యాంటీన్ , మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి సన్మాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఇందులో ముఖ్యఅతిథిగా మేయర్ లతా ప్రేమ్ గౌడ్ , డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి కమిషనర్ శరత్ చంద్ర పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సబితా రెడ్డిని కలిసిన బాబుల్ రెడ్డి నగర్ వాసులు

రాజేంద్రనగర్, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ చెందిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక యువకులు మాజీ మంత్రి సబితా రెడ్డిని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్న సందర్భంగా మాజీ మంత్రి మహేశ్వరి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వసంత్ కుమార్ ,నారాయణ లు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. సబితా రెడ్డిని కలిసిన వారిలో కార్తీక్ ముదిరాజ్ పాల్గొన్నారు.


మాజీ మంత్రి సబితా రెడ్డికి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న బాబు రెడ్డి నగర్ వాసులు



వ్యవసాయ విద్యా దినోత్సవంను ప్రారంభిస్తున్న వర్శిటీ పరిశోదన సంచాలకులు డాక్టర్ పి రఘురామి రెడ్డి

# రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో విద్యా దినోత్సవం

బుద్వేల్, డిసెంబరు3 (ప్రభాత ఉదయం): భారత దేశ తొలి రాష్ట్రపతి, వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ రాజేం ద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ పీజీ స్టడీస్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, వర్శిటీ రిజిస్ట్రార్ డి.శివాజీలు హాజరైనారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు ప్రారంభించి పరిశీలించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వ్యవసాయ విద్యపై మక్కువ పెంచుకోవాలన్నారు. చిన్నతనం నుంచి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. భారత దేశంలో వ్యవసాయం ప్రజల జీవన విధానంలో ఒక అంతర్భాగం అని గుర్తు చేశారు. పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వ్యవసాయ పరిజ్ఞానం తెలియజేయడానికి పీజీ, పీహెచ్ విద్యార్థులు సాళ్లను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని గుర్తు చేస్తు వారిని అభినందించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వకృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఓఎస్ ఏ డాక్టర్ ప్రశాంత్, వివిధ శాఖల అదిపతులు, ప్రొఫెసర్లు, విద్యారులు పాల్గొన్నారు.


వ్యవసాయం గురించి విద్యార్థులకు వివరిస్తున్న పీహెచ్ డీ విద్యార్థులు


వ్యవసాయ విశ్వవద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య ను కలసిన మాజీ డీన్ డాక్టర్ టీవీకే సింగ్ కుటుంబ సభ్యులు

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల సందర్భంగా బంగారు పతకాన్ని ప్రకటించిన మాజీ డీన్ కుటుంబ సభ్యులు

బుద్వేల్, డిసెంబరు3(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు డాక్టర్ టీవీకే సింగ్ కుటుంబ సభ్యులు డైమండ్ జుబ్లీ గోల్డ్ మెడల్ అందివ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు టీవీకే సింగ్ వారి సోదరుడు శివకుమార్ ఠాకూర్‌తో కలసి మంగళవారం వర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను కలిశారు. ఈ సందర్భంగా ఉప కులపతి ప్రొఫెనర్ అల్దాస్ జానయ్య వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ డీన్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.


డిపో మేనేజర్ బద్రి నాథ్ కు వినతి పత్రం అందజేస్తున్న మధుబన్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

# మధుబన్ కాలనీ చౌరస్తా నుండి ఆర్టీసీ బస్సులు వన్ వే నడుపాలి

రాజేంద్రనగర్, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) మధుబన్ కాలనీ చౌరస్తా నుండి వన్ వే లో ఆర్టీసీ బస్సులను నడపాలని కాలనీ వెల్ఫేర్అసోసియేషన్ సభ్యులు కోరారు. మంగళవారం రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనాథ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు . కాలనీలో కాకాతీయ పాఠశాల ముందు రహదారి ఎత్తుగా ఉ ండడంతో బస్సు రద్దితో ఎక్కలేక పోతున్నాయన్నారు. గతంలో కాలనీలో బస్సు వన్ వే లో వెళ్తుండేవి అని అదే తరహా ఇప్పుడు వెళ్తే బాగుంటుందని డిపో మేనేజర్ బద్రీనాథ్ కు వివరించారు. కోటి నుండి శ్రీరామ కాలనీకి వచ్చేటప్పుడు కాకతీయ పాఠశాల నుండి వెళ్లాలి, శ్రీరామ్ కాలనీ నుండి కోఠికి వెళ్లేటప్పుడు శ్రీగాయత్రి పాఠశాల ముందు నుండి నడపాలని కాలనీవాసులు కోరారు. రాజేంద్రనగర్ డిపో మేనేజర్ మాట్లాడుతూ.. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు తప్పని సరిగా బస్సును వన్ వేలో నడిపిస్తామనన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులను నడిస్తామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ , వీరాంజనేయ దేవాలయం కమిటీ సభ్యులు కిషోర్, ఉదయ్ ,చిన్నా, తదితరులు ఉన్నారు. నడిపిస్తామనన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా బస్సులను నడిస్తామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ , వీరాంజనేయ దేవాలయం కమిటీ సభ్యులు కిషోర్, ఉ దయ్ ,చిన్నా, తదితరులు ఉన్నారు.

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## వికలాంగులను సన్మానించి మెమొంటోలను అందజేస్తున్న కలెక్టర్ సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం నందు మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ వికలాంగుల వయోవృద్ధుల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగవైకల్యం అనేది విజయానికి ఏమాత్రం అడ్డుకాదని అన్నారు. ఎంతో మంది దివ్యాంగులు కష్టపడి ఎన్నో విజయాలు సాధించారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం రిక్రూట్‌మెంట్‌కు 2% రిజర్వేషన్, పెన్షన్ అందిస్తుందని ఈ అవకాశాలను పూర్తిగా స్థాయిలో వినియోగించుకోవాలి అన్నారు. మండల స్థాయిలో దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. 2016 చట్టం, 92 ప్రకారం దివ్యాంగులను కించపర్చినా, అవమానించిన, భయపెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్ట ప్రకారం 6 నెలల నుండి 5 సం.ల వరకు జైలుశిక్ష లేదా చర్యలు చేపట్టబడతాయని అన్నారు. ఈ విషయంపై మండల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సమయంలో సౌకర్యార్థం ప్రతి పోలింగ్ కేంద్రంలో సులభంగా ఓటు హక్కు వినియోగించడానికి ర్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది. అంతే కాక దివ్యాంగులు (అంధులు)తమ ఓటు హక్కును సరిగ్గా వినియోగించుకునేలా వారికి ప్రత్యేకంగా 'బ్రెయిన్ లిపి' సౌకర్యం కూడా అందించబడిందనీ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు ఉన్నాయాని, ఎక్కడ ర్యాంపులు లేనిపక్షంలో ఆ కార్యాలయాల జాబితా తయారు చేసి, ర్యాంపులు,వీల్ చైర్స్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పాదాల్లేకుండా ఒక శారీరకంగా అంగవైకల్యమైన వ్యక్తి మౌంట్ ఎవరెస్ట్‌ను అధిరోహించి, అత్యున్నత శిఖరాన్ని చేరుకున్నడానీ తెలిపారు. మీరు కూడా మానసిక బలంతో జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ, పారాలింపిక్స్‌లో భారత్ 29 పతకాలు గెలుచుకుని 18వ స్థానంలో నిలిచిందని అన్నారు. దివ్యాంగులు శారీరక పరిమితులు లేకుండా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. కాబట్టి మానసిక బలంతో మీరు కూడా జీవితంలో ఉన్నతమైన స్థాయిని చేరుకోవచ్చని అన్నారు. జిల్లాలో పోలీసు శాఖ 365 రోజులు మీకు మద్దతుగా ఉంటుందని, మీ గౌరవాన్ని దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు స్టేషన్లలో మీ సౌకర్యం కోసం అన్ని సౌకర్యాలు. ఏర్పాటు చేస్తామని అన్నారు. మానసికంగా బలంగా ఉండి, జీవితంలో విజయాన్ని సాధించాలని అన్నారు.అనంతరం రాష్ట్ర స్థాయిలో చెస్ పోటీల్లో ప్రథమ బహుమతులు పొందిన వీరేష్, అర్చన, మాధవ్‌కు అలాగే జిల్లా స్థాయిలో క్రీడా పోటీల్లో గెలిచిన 26 మంది దివ్యాంగులకు ప్రైజ్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధి హామీ దివ్యాంగ కూలీలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,జెడ్పీ సి.ఈ.ఓ కాంతమ్మ, డి.డబ్ల్యు.ఓ సుధారాణి, డి సి పి ఓ నరసింహ, దివ్యాంగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ చంటి బాబు, సి.డీ.పి.ఓ లు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# 2 కిల్లోల సీహెచ్ పట్టివేత



నిందితుడు తలారి బొల్లప్పతో ఎక్సైజ్ పోలీసులు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామానికి చెందిన తలారి బోలప్ప అనే వ్యక్తి అక్రమంగా సీహెచ్ విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం గద్వాల ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో రెండు కిల్లోల క్లోరల్ హైడ్రెట్ స్వాధీన పరచుకుని నిందితున్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు గద్వాల ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి తెలిపారు.ఈ దాడుల్లో గద్వాల ఎక్సైజ్ ఎస్ఐ లు వెంకటేష్ , వీరేశలింగం, సిబ్బంది పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

కొత్తకోట, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) పట్టణ కేంద్రంలోని శ్రీ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొని అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, అయ్యప్ప సేవాసమితి వ్యవస్థాపకులు శ్రీ గోపాలకృష్ణ గురుస్వామి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములతో పాటుగా సహపంక్తి లో పాల్గొని భోజనం చేశారు.అన్నదానం ఏర్పాట్లు చూసి ఆకర్షితులైన ఎమ్మెల్యే బావమరిది గోపినాథ్ రెడ్డి రూ. 55,580/- విరాళం ఇవ్వడం జరిగిందని, ఈ నెల 7వ తేదీ రోజు సుబ్రమణ్య షష్టిని పురస్కరించుకుని మహాపడి పూజ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్నిఎమ్మెల్యే విడుదల చేశారు. జిల్లా మంత్రికి, జిల్లా లోని అందరూ శాసనసభ్యులకు, ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసి మహా పడిపూజకు తప్పక రావలసిందిగా ఆహ్వానించడం విశేషమని అన్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షులు ధూపం నాగరాజు, ప్రధాన కార్యదర్శి పొగాకు అనీల్ , కోశాధికారి విశ్వనాథం గంగాధర్,అర్చకులు జోషి,రవికాంత్ , జంగం నటరాజ్, గురు స్వాములు ఉమా మహేశ్వర రెడ్డి , కండే నరేష్ , రఘువేంద్ర చారి , మోహన్ రెడ్డి , మద్దిగట్ల బాలకృష్ణ , సత్యం సాగర్ , వేముల సుధాకర్ రెడ్డి , బండారు రాజశేఖర్ , భాస్కర్ రెడ్డి , రవి రెడ్డి , లక్ష్మీ నారాయణ యాదవ్ , జేసిబి భాస్కర్ , నరేష్ , భీమ కిషోర్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కొత్తకోట మండలం ఆర్‌ఎంపీ డాక్టర్ల నూతన కార్యవర్గం

## అధ్యక్షునిగా డాక్టర్ జే.జాన్

కొత్తకోట, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల ఆర్‌ఎంపీ డాక్టర్ల నూతన కార్యవర్గాన్ని వనపర్తి జిల్లా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షులుగా డాక్టర్ జే.జాన్ , ఉపాధ్యక్షులుగా డాక్టర్ వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాజిద్ అలీ,కోశాధికారిగా నారాయణ,ప్రచార కార్యదర్శిగా డాక్టర్ సాదిక్,గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ అశోక్ కుమార్లు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. .ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఆర్‌ఎంపీ డాక్టర్ల కార్యవర్గానికి వనపర్తి జిల్లా ఆర్‌ఎంపీ డాక్టర్లు శాలువాతో పూలమాలతో సన్మానించిసత్కరించారు.





# న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం గద్వాల జిల్లా కోర్టు ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసుకొని కొన్ని అనివార్య కారణాలవల్ల పాత జిల్లా కార్యవర్గాన్ని రద్దు చేసి, నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కోడుమూరు అశోక్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ గా హెచ్. సి.వీరవసంతుడు, ఉపాధ్యక్షులుగా సయ్యద్ బాషా, కె.అశోక్ కుమార్, ఎం.పుష్పలత, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఇర్షాద్ అహ్మద్, సహాయ కార్యదర్శులుగా ఆర్. నాగరాజు, వై.చెన్నకేశవ రెడ్డి, పి.శేషగిరి, కోశాధికారిగా ఎం.గజేంద్రుడు, సలహాదారుడిగా కోడుమూరు నల్లారెడ్డి, క్రీడలు మరియు సాంస్కృతిక కార్యదర్శిగా ఎస్.అశోక్ కుమార్, సమన్వయ కర్తగా జి.అమీర్, మహిళ ప్రతినిధిగా ఆర్.సూర్య రేఖ, నిర్వహక సభ్యులుగా పి.గోపినాథ్ ఎండి కమాల్ , అర్.రెహ్మాన్, కె.చంద్రశేఖర్ ఎం.సురేష్ బాబు, డి.రవి, ఎ.అనూష, ఎన్ శివరాణి,బి.శ్రీనివాసులు, ఎండి. షాకీర్ అలీ, ఎస్.నాగేశ్వర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని గద్వాల కోర్టు జడ్జి కుష సన్మానించారు.



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఆయిల్ ఫామ్ రైతులకు రేటు పెంచిన ప్రభుత్వం

కొత్తకోట, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం)ఆయిల్ ఫామ్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని సంగం అధ్యక్షులు వేముల హరీష్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జిఎంఆర్ ల చిత్రపటాలకు కొత్తకోట మండల కేంద్రం చెందిన ఆయిల్ ఫామ్ రైతులు, రైతు సంఘాల నాయకులు. వేముల హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గతంలో పామాయిల్ గెలలు టన్నుకు 13 వేల రూపాయలు ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్ గవర్నమెంట్ ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఒక టన్నుకు 21,400 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గొల్ల బాబు, మాజీ జెడ్పిటిసి పీజే బాబు, రైతు సంఘం అధ్యక్షులు ఎస్ వెంకటేష్, శ్యామ్ సుందర్ రెడ్డి,సాయిల్ యాదవ్, నరేందర్ రెడ్డి, బుచ్చన్న, లక్ష్మారెడ్డి,పి వెంకటేశ్వర్ రెడ్డి,మాధవ్,రామచంద్ర రెడ్డి, సలీం ఖాన్,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.





# శ్రీకాంతాచారికి ఘన నివాళి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలోని నది అగ్రహారం పీజీ సెంటర్‌లో మంగళవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, అమరవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అలనాటి తెలంగాణ ఉద్యమ విధానం, తెలంగాణ కోసం అసువులు బాసిన అమరుల త్యాగాలను గుర్తుంచుకొని మనం మన జీవితంలో మంచి మార్గంలో వెళ్లాలని తెలిపారు. అగ్నికి ఆహుతి అవుతూ 'జై తెలంగాణ' అంటూ దిక్కులు పెక్కటిల్లేలా నినదించిన పోరాట యోధుడు శ్రీకాంతాచారి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బండరపల్లి అరవింద్, డా. మంగళగిరి శ్రీనివాసులు, డా.గోపినాథ్, గణేష్, డా. రవి శేరిన్, మహమ్మద్ రఫీ, నవీన్ గౌడ్, రంగారెడ్డి, నరేష్ రెడ్డి, వేణుగోపాల్ మరియు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్





వినతి పత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

# లేప్రసి సర్వే డబ్బులు చెల్లించాలని ఆశ కార్యకర్తల ధర్నా

కొత్తకోట, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం)గత రెండు సంవత్సరాల గా పెండింగ్ లో ఉన్న లెప్రసీ పల్స్ పోలియో సర్వే డబ్బులను చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం లో ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ... 2023 సంవత్సరంలో ఆశా కార్యకర్తలు చేసిన లెప్రసీ సర్వే డబ్బులు పెండింగ్ లో ఉన్నాయని 2024 లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశలకు చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు.ఇంటర్ ఎగ్జామ్స్ గ్రూప్ 3 ఎగ్జామ్స్ డ్యూటీలు చేసినవారికి ఎలాంటి గౌరవేతనం ఇవ్వకుండా ఒట్టి చేతులతో పంపించారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఆశలకు 18,000 ఫిక్స్ వేతనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందని నేటికీ ఆశలను పట్టించుకోకపోవడం మరి దారుణమని ఆయన చెప్పారు.పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న లెఫ్రిసి పల్స్ పోలియో సర్వే నిధులు ఇవ్వడం లేదని మళ్లీ కొత్తగా లెప్రసీ సర్వే చేయాలని ఒత్తిడి చేయడం అన్యాయమని ఆయన అన్నారు. అనంతరం డాక్టర్ కు వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు మంజుల, పుష్ప,అర్చన, సంతోష, రజిత,రేణుక,చంద్రకళ,పాలెం మంజుల, చిట్టెమ్మ, భాగ్య,స్వాతి,పద్మ,శ్వేత,గీత,కాంచన, తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులతో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# దివ్యాంగులపై ప్రతి ఒక్కరు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) దివ్యాంగుల పై ప్రతి ఒక్కరు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సంధర్భంగా జీ.హెచ్.యం.సి మల్కాజిగిరి సర్కిల్ అధికారులు పద్మావతి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన వికలాంగుల కార్య సంకల్పం (వికాసం) అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దివ్యాంగుల పై వివక్ష చూపకుండా వారిని అందరితో సమానంగా భావించాలని అన్నారు. సమాజానికి దివ్యాంగులే స్ఫూర్తి ప్రదాతలని ప్రతి విషయంలో వారికి తోడుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజు, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, డిపిఓ మల్లిఖార్జున్, ఏఎంహెచ్ ఓ నిర్మల సి. ఓ లు .వి.ఆర్.పి బాబు తదితరులున్నారు.

# దివంగత తెలంగాణ ఉద్యమ నేత శ్రీకాంతచారికి మీ వాళ్ళు అర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి





శ్రీకాంత్ చారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బి.ఆర్.ఎస్.వి నాయకులు

మల్కాజిగిరి, డిసెంబర్ 3(ప్రభాత ఉదయం) తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన విద్యార్థి అమర వీరుడు కె. శ్రీకాంతా చారి 15వ వర్ధంతి సందర్భంగా బి.ఆర్.ఎస్. వి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని నివాళ్ళు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బి.ఆర్.ఎస్. వి.అధ్యక్షుడు ఆర్ నర్సింగ్, మనోజ్,మధు, సంతోష్ మహేష్ ,విజయ్ , కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.